# ఉరుకుంద ఈరన్న స్వామి హుండీకి కాసుల వర్షం



## ఆరు రోజుల హుండీ ఆదాయం రూ.1.41 కోట్లు





**కౌతాళం,సెప్టెంబరు01.అక్షరటైమ్స్:–** ఉరుకుంద శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానానికి భక్తులు సమర్పించిన కానుకలు భారీగా వచ్చాయి. శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా ఆరు రోజులపాటు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,41,05,560 ఆదాయం సమకూరింది. వీటితోపాటు అమెరికా కరెన్సీ 8 డాలర్లు, బంగారం 16 గ్రాముల 980 మిల్లీగ్రాములు, వెండి 25 కిలోల 3 గ్రాములు లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కే.వాణి ఆధ్వర్యంలో, పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ హుండీ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**భక్తుల విశ్వాసమే బలం**

ఈ సందర్భంగా ఈఓ కే.వాణి మాట్లాడుతూ శ్రావణ మాస ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈరన్న స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. స్వామివారిపై భక్తులకు ఉన్న విశ్వాసంతో హుండీల్లో సమర్పించిన కానుకల కారణంగానే ఈ స్థాయిలో ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి కే.కమలాకర్, వన్ ఎన్టీ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కర్నూలు దేవస్థానం పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ ఆదోని సిబ్బంది, శ్రీ భ్రమరాంబ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# సంక్షేమం స్వయం ఉపాధి సాధికారత!







## అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనం సకాలంలో అందాలి - కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**గోనెగండ్ల,సెప్టెంబరు01,అక్షరటైమ్స్:–** అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. మంగళవారం గోనెగండ్ల మండలం లక్ష్మీపేటలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పెన్షన్లు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

**పేపర్ తయారీ కేంద్రం పరిశీలన**

అనంతరం పీఎంఈజీపీ కింద నిర్వహిస్తున్న పేపర్ తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పేపర్ తయారీ విధానం, ఉత్పత్తులు, విక్రయాలు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై ఆరా తీశారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిట్ నిర్వహణ, ఉత్పత్తుల నాణ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై నిర్వాహకులతో కలెక్టర్ చర్చించారు. మరింత మంది యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.

**మహిళలు ఆర్థికంగా ఎదగాలి**

స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ రుణ సహకారంతో ఏర్పాటు చేసిన చీరల దుకాణాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. దుకాణంలో విక్రయిస్తున్న చీరల వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. దుకాణం నిర్వహణ, వ్యాపారానికి సంబంధించిన అంశాలపై వివరాలు సేకరించారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని ప్రోత్సహించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

# సచివాలయంలో జిల్లా అధికారి ఆకస్మిక తనిఖీ



**గోనెగండ్ల,సెప్టెంబర్01, అక్షర టైమ్స్:–** మండలంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని జిల్లా అధికారి భాస్కర్‌నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని హాజరు రిజిస్టర్‌తో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా, విధుల నిర్వహణలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే సచివాలయ సిబ్బంది ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# కలెక్టర్ రాజకుమారికి రెడ్‌క్రాస్ బంగారు పతకం



**నంద్యాల,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నంద్యాల జిల్లాలో విశిష్ట సేవలు అందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు ప్రతిష్ఠాత్మక బంగారు పతకం లభించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర వార్షిక సమావేశంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్‌కు సొంత భవనం ఏర్పాటు చేయడంతో పాటు రక్త నిల్వ కేంద్రం, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, 'మీ ఇంటికి మీ డాక్టర్' వంటి ప్రజోపయోగ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ పురస్కారం లభించింది. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా ఆధునిక సదుపాయాలతో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రెడ్‌క్రాస్ భవనానికి సౌర విద్యుత్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్‌లో డోన్, శ్రీశైలం ప్రాంతాలతో పాటు జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి రక్త నిల్వ కేంద్రాలు, జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ఆరెకల్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన గుడిసె ఆది కృష్ణమ్మ



**ఆదోని,సెప్టెంబరు01.అక్షరటైమ్స్:–** ఆదోని మండలం ఆరెకల్ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులతో ఆది కృష్ణమ్మ ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపీపీ మురళి, రంగస్వామి, ఎల్ఎల్‌సీ ఛైర్మన్ రామస్వామి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, రంగన్న, సాదిక్‌వలి, స్థానిక టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రాఘవేంద్ర, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పింఛన్ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు

## ప్రత్యేక పూజలు శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం సందర్శన





**చక్రాయపేట,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** రాయలసీమ జిల్లాల్లోనే ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామివారిని మాజీ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారని ఆలయ సహాయ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి వేద ఆశీర్వచనాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, దుశ్శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వెల్లంపల్లి శ్రీనివాసరావు స్వామివారిని ప్రార్థించారు. గండి క్షేత్రం ఆలయ పాలకమండలి ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, మాజీ ఛైర్మన్ కావలి కృష్ణతేజ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గండిక్షేత్రంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించారు. ఆ సత్రం పాలకవర్గం సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావును శాలువతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గుబ్బ చంద్రశేఖర్, రేపాల శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, మిట్టా కరుణాకర్, గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు రాయవరం శివరావు, అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీకిషోర్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో పెరుగుతున్న ధరల భారం

## నిత్యావసర ధరలు తగ్గించాలి

## ఏపీసీసీ మీడియా చైర్మన్ డా"ఎన్. తులసి రెడ్డి



**వేంపల్లె,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, వంట నూనెలు, ఎండుమిరప, చింతపండు, చక్కెర తదితర వస్తువుల ధరలు ఏడాది కాలంలో 40 నుంచి 70 శాతం వరకు పెరిగాయని తెలిపారు. ఏమి కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు అనే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.21,243 కోట్ల అదనపు భారాన్ని వినియోగదారులపై మోపిందని ఆరోపించారు. కర్ణాటక, తమిళనాడుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.6 నుంచి రూ.10 వరకు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యాట్, అదనపు వ్యాట్, రోడ్డు డెవలప్‌మెంట్ సెస్సును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎరువుల ధరలు 50 కిలోల బస్తాపై రూ.500 నుంచి రూ.800 వరకు పెరిగాయని, వాటిని తగ్గించి రైతులపై భారం తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వెంకటేశు, రామాంజనేయ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు

## ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ

## టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర



**వేంపల్లె,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** స్థానిక పట్టణంలోని రెడ్డయ్య కాలనీలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి వీరభద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. గతంలో రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రూ.4 వేలకు పెంచి అందిస్తోందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి అందుతున్న పింఛన్ చంద్రన్న సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను అందించనున్నట్లు పసుపులేటి వీరభద్ర తెలిపారు.

# బీటెక్ పట్టా పొందిన నొస్సం వివేకానంద స్వామి

## కుమారుడి విద్యా విజయంపై మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి హర్షం



**బ్రహ్మంగారిమఠం,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ శ్రీ వెంకటాద్రి స్వామి వారి కుమారుడు నొస్సం వివేకానంద స్వామి తిరుపతిలోని మోహన్ బాబు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి పట్టా పొందారు. ఈ సందర్భంగా తమ కుమారుడు ఉన్నత విద్యలో బీటెక్ కోర్సును సంపూర్ణంగా పూర్తి చేసి పట్టా పొందడం పట్ల మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నొస్సం వివేకానంద స్వామి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నొస్సం వివేకానంద స్వామికి కుటుంబ సభ్యులు, మఠం భక్తులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

# భక్తులకు ప్రజలకు ఇబ్బందులు కలిగించకండి

## వాహన..దుకాణదారులకు సూచనలు ఇచ్చిన యస్ ఐ శివప్రసాద్



**బ్రహ్మంగారిమఠం,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటర్లో ఉన్న దుకాణ దారులకు మరియు వాహనదారులకు స్థానిక ఎస్సై మరియు వారి సిబ్బంది కలిసి వాహన దారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎస్సై శివప్రసాద్ మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తులకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటర్ నందు వాహనాలు నిలిపేవారు. బ్రహ్మంగారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. అలాగే ఐదు రోడ్ల సెంటర్ నందు వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నా ప్రతి ఒక్కరూ ప్రజలకు భక్తులకు ఇబ్బంది లేకుండా వ్యవహరించాలని తెలిపారు.

# "తల్లికి వందనం" కార్యక్రమంపై సమీక్ష



**బద్వేల్,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో "తల్లికి వందనం" కార్యక్రమంపై మంగళవారం మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమ పురోగతి, లబ్ధిదారుల వివరాలు పెండింగ్ అంశాలపై సమీక్షించారు. సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బి. హరినాథ్,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యంలో ధృవతార 'పుట్టపర్తి'



**ప్రొద్దుటూరు,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** తెలుగు సాహిత్య ఆకాశంలో పుట్టపర్తి నారాయణాచార్యులు ధ్రువతార అని ప్రొద్దుటూరు ఉప విద్యాధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఉదయం శివాలయం సర్కిల్లోని పుట్టపర్తి నారాయణాచార్యుల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పుట్టపర్తి సాహితీ పీఠం నిర్వహించిన పుట్టపర్తి 36 వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆ మహాకవి ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేసి శివతాండవశీ వంటి మహా కావ్యాన్ని రచించడం మన భాగ్యమని కొనియాడారు. పుట్టపర్తి సాహితీ సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆయన ఒక కారణజన్ముడని 12 ఏళ్ల వయసులోనే పెనుగొండ కావ్యాన్ని రచించి తన అసాధారణతో ప్రతిభతో 150 కావ్యాలు తెలుగు సాహిత్యానికి అందించిన ఆయన 14 భాషలలో విశేష ప్రతిభను చూపిన మహామేధావి అని పేర్కొన్నారు. గత 36 సంవత్సరాలుగా పీఠం నెలగొల్పి జయంతి వర్ధంతులను నిర్వహిస్తూ ఆయన సాహిత్యాన్ని ప్రచారం గావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి శీను, కాశీవరకు వెంకటసుబ్బయ్య, బాలగంగాధర్ తిలక్, కాలే దేవానంద్, విద్యార్థి భాస్కర్, ఉదయగిరి శివరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి శివప్రసాద్ ను ఘనంగా సన్మానించారు.

# కడపలో రంచనుగా పింఛన్ల పంపిణీ



**కడప,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:–** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని 19, 20 మరియు 21 డివిజన్లలో అర్హులైన లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, కార్పొరేటర్లు ఫక్రుద్దీన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలు మరియు వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు.

# కొర్రపాడు మరియు కోడి గాండ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి ఎడి ఏ కె రామమోహన్ రెడ్డి**

**పోలం కలిగి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడి పొందాలి మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**



**ముద్దనూరుసెప్టెంబర్01.అక్షరటైమ్స్:-** మండలంలోని కొర్రపాడు మరియు కోడిగాండ్ల పల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎడి ఏ కె రామ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి ఏ రామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగు చేసిన అన్ని పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి అన్నారు. పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ ఐడి పొందాలి అన్నారు. సిబ్బందిని అడిగి ఆయా గ్రామాల్లో సాగు అయిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలి అన్నారు. పంట నమోదు కాకపోతే ఏ పథకం వర్తించదు అన్నారు.పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ ఐ డి పొందాలి అన్నారు.అనంతరం గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న, ఉల్లి పంటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అందించారు. గ్రామ రైతులు సకాలంలో వర్షాలు లేక బోరు బావుల్లో నీటి మట్టం తగ్గి పోయి పంటలకు సరిపడినంత నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు అంజనమ్మ శిరీష, గ్రామ రైతులు వి.కేశవ రెడ్డి, వై.శ్రీధర్ రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కనుమరుగవుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద ముగ్గురాయి నిక్షేపాలు.. మంగంపేట బెరైటీస్ మైన్స్ ఇక లేనట్టేనా..




ప్రపంచంలోనే అత్యంత పెద్ద ముగ్గు రాయి నిక్షేపాలు కలిగిన మంగంపేట బెరైటీస్ మైన్స్ ఇక లేనట్టేనా... దాదాపు 5 దశాబ్దాల కాలం భారతదేశానికి బెరైటీస్ ఘనులలో వెన్ను దన్నుగా నిలిచిన ఈ గనుల ప్రాంతం మరో రెండేళ్లలో కనుమరుగైపోతుందా..? ఎన్నో వేలాది మందికి ఉపాధి కల్పించిన ఈ ప్రాంతం కాలగర్భంలో కలిసిపోనుందా.. ప్రపంచంలోనే బెరైటీస్ అంటే గుర్తొచ్చేది ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలో గల మంగంపేట మైన్స్. ఉమ్మడి కడప జిల్లాలో భాగంగా ఆ తరువాత అన్నమయ్య జిల్లాకు ప్రస్తుతం తిరుపతి జిల్లాలో మంగపేట ముగ్గు రాయి నిక్షేపాలు ఉన్నాయి. అలాంటి మైన్స్ రానున్న కాలంలో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మరో రెండేళ్లు మాత్రమే ఇక్కడ ఈ నిక్షేపాలు దొరుకుతాయంట. దాదాపు 52 సంవత్సరాలుగా ఇక్కడ బెరైటీస్ నిక్షేపాలను అందించిన ఈ ప్రాంతం రానున్న కాలంలో ఒక మైలురాయిగా మాత్రమే నిలవనుంది. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ నిక్షేపాలను వెలికి తీసేటప్పుడు వాడే మిషనరీ ప్రెషర్ వల్ల వచ్చే వేడిని తగ్గించడానికి ఈ బెరైటీస్?ను అధికంగా వాడుతారు. 1974లో ప్రారంభమైన ఈ మైన్స్ మరో రెండేళ్ళు మాత్రమే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక్కడ మరో 5000 మెట్రిక్ టన్నులు మాత్రమే బెరైటీస్ తీయగలమని తేల్చి చెప్పారు. ఏడాదికి మూడువేల మెట్రిక్ టన్నులు ప్రస్తుతం తీస్తున్నామని మంగంపేట బెరైటీస్ గనుల సీపీవో గోపీనాథ్ తెలిపారు. అయితే ఇక్కజ దొరికే పుల్లరిన్ నిక్షేపాల పరిశోధన, దాని శుద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. మంగంపేట మైన్స్?లో బెరైటీస్ నిక్షేపాల తవ్వకాలు ఆగిపోయినా.. మరో పది నుంచి పదిహేనేళ్ళ వరకు సరిపోయేలా నిల్వలు ఉన్నాయని సీపీవో తెలిపారు..

# ఉద్యోగంతో పన్లేదు.! ఇంటి నుంచే ఈ వ్యాపారంతో నెలకు రూ. 40 వేలు మీ సొంతం.. అదేంటంటే



ఉద్యోగం పోయిందా.. డోంట్ వర్రీ.. మీకోసం ఓ బెస్ట్ బిజినెస్ ఐడియా మీ ముందుకు తీసుకొచ్చాం. అది ఏంటో విన్నారంటే.. కచ్చితంగా మీరు ఇప్పుడే డబ్బులు పెట్టి.. నెల నెలా లక్షలు సంపాదిస్తారు. మరి ఏంటంటే.? ఈ స్టోరీ ఓ సారి చూసేయండి. ఉద్యోగం కోసం ప్రయత్నించి.. నిరాశ చెందినవారికి ఓ అద్భుతమైన బిజినెస్ ఐడియా.. వారికి టీ వ్యాపారం ఓ లాభదాయక ఆదాయాన్ని అందిస్తుంది. కేవలం పది రూపాయల రోజూ టీని అమ్మితే.. ప్రతీ నెలా రూ. 40 వేలు, ఏడాదికి రూ. 4.8 లక్షల వరకు సంపాదించవచ్చు. ఆ వివరలు ఇలా.. ఉద్యోగం దొరకనప్పుడు, స్వయం ఉపాధిని ప్రారంభించడం ఒక తెలివైన నిర్ణయం. అలాంటి వాటిలో టీ వ్యాపారం ఒక అద్భుతమైన మార్గం అని చెప్పొచ్చు. చిన్న పెట్టుబడితో, సరైన ప్లాన్?తో టీ దుకాణం ద్వారా గణనీయమైన ఆదాయాన్ని పొందవచ్చు. ఒక కప్పు టీ ధర రూ.10గా నిర్ణయిస్తే.. రోజుకు 200 కప్పుల టీ అమ్మినట్లయితే.. రూ. 2 వేలు సంపాదించవచ్చు.. ఇలా నెల రోజులకు రూ. 60 వేలు లాభం వస్తుంది. ఇక టీ తయారీకి అయ్యే నెలవారీ ఖర్చు రూ. 15 వేలు తీసేయగా.. దుకాణం అద్దె కోసం మరో రూ. 5 వేలు పక్కన పెట్టగా.. మొత్తం నెలవారీ ఖర్చులు రూ. 20 వేలు అవుతాయి. అలా వచ్చిన లాభంలో రూ. 20 వేలు తీసేయగా.. నెలవారీ నికర ఆదాయం రూ. 40 వేలు అవుతుంది. ఈ లెక్కన, ఒక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ. 4.80 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉంది. ఈ సులభమైన టీ వ్యాపారాన్ని ప్రారంభించి, లక్షల్లో సంపాదించవచ్చు.

# పారిశుద్ధ్య సిబ్బందిని ఇతర పనులకు మళ్లించొద్దు

**మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, కమీషనర్లకు సిఐటియు వినతి**





**బద్వేలు,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:-** బద్వేలు పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో కార్మికులుగా నమోదు కాబడి, అదే హోదాకు సంబంధించిన వేతనాలు పొందుతూ ప్రస్తుతం పారిశుద్ధ్యేతర పనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను గుర్తించి, నిబంధనల ప్రకారం తిరిగి పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని బద్వేల్ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి బద్వేల్ పురపాలక సంఘం ప్రత్యేక అధికారి చంద్రమోహన్,బద్వేల్ పురపాలక సంఘం కమిషర్ యం.కృష్ణ లకు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె. శ్రీనివాసులు మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులుగా నమోదు అయి, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పొందుతున్న కొంతమంది ప్రస్తుతం ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని,దీంతో వాస్తవంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సంఖ్య తగ్గిపోయి, మిగిలిన కార్మికులపై అదనపు పని భారం పడుతోందని,వీధుల శుభ్రత, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాలువల శుభ్రత తదితర పనులను పరిమిత సంఖ్యలో ఉన్న కార్మికులే నిర్వహించాల్సి వస్తోందని,పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సేవలను సమర్థవంతంగా నిర్వహించడం కష్టతరంగా మారుతోందని,ఒకవైపు పట్టణ జనాభా, పారిశుద్ధ్య అవసరాలు పెరుగుతుండగా, మరోవైపు అందుబాటులో ఉన్న సిబ్బందిని ఇతర పనులకు వినియోగించడం వల్ల పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై తీవ్రమైన పని భారం పడుతోందని,పారిశుద్ధ్య విభాగంలో నమోదు అయిన ప్రతి కార్మికుడి ప్రస్తుత విధులను అధికారులు సమీక్షించాలని,ఎవరు ఏ హోదాలో నియమితులయ్యారు? ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? ఏ పనులు చేస్తున్నారు? ఏ హోదాకు సంబంధించిన వేతనాలు పొందుతున్నారు? అనే అంశాలపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పారిశుద్ధ్యేతర విధుల్లో కొనసాగుతున్న వారిని గుర్తించాలని,ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులపై అదనపు పని భారం మోపకుండా, అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరానికి అనుగుణంగా సముచితంగా కేటాయించాలని,కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం, పని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పని విభజన చేపట్టాలని, ఒకే కార్మికుడిపై అధిక పనిభారం పడకుండా చర్యలు తీసుకోవాలని,పట్టణ పారిశుద్ధ్యం కేవలం కార్మికుల సమస్య మాత్రమే కాదని, ఇది ప్రజారోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన అంశమని,అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులకు వినియోగించి, ప్రతి వార్డు పరిధిలో తగినంత మంది కార్మికులను కేటాయించాలని, తద్వారా పట్టణంలో చెత్త సేకరణ, వీధుల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందని,ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్య విభాగంలోని సిబ్బంది విధులను సమీక్షించాలని, ఇతర విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులను నిబంధనల ప్రకారం తిరిగి పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో-కన్వీనర్ పి.సి. కొండయ్య, యూనియన్ అధ్యక్షులు ఎన్. సత్యరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి. హరి, ఉపాధ్యక్షులు జి. శ్రీనివాసులు, ఎన్. పాలయ్య, ప్రధాన కార్యదర్శి కె. నాగేంద్రబాబు, కార్యదర్శి పి. శ్యామ్ ప్రవీణ్, కోశాధికారి కె. శివకుమార్, కమిటీ సభ్యులు పి. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ప్రస్థానం

పవర్ స్టార్ పుట్టినరోజు సందర్బంగా వెండితెర ట్రెండ్‌సెట్టర్ నుండి ప్రజానాయకుడి వరకు వ్యాసరచన :బొల్లు రామమోహన్, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, రచయితఉపోద్ఘాతం తెలుగు చలనచిత్ర పరిశ్రమపై తనదైన ముద్ర వేసి, కోట్లమంది అభిమానుల హృదయాల్లో "పవర్ స్టార్"గా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పవన్ కళ్యాణ్ ప్రస్థానం ఒక అసాధారణమైన పాఠం. ఒక నటుడిగా, దర్శకుడిగా, మార్షల్ ఆర్టిస్ట్‌గా, ఆ తర్వాత సమాజంలో మార్పు కోసం నిలబడిన ఒక ప్రజా నాయకుడిగా ఆయన ప్రయాణం నిరంతరం కొత్తదనంతో, ఆదర్శవంతంగా సాగింది.

**జన్మ వృత్తాంతం మరియు ప్రారంభ జీవితం**

బాపట్లలో కొణిదెల వెంకటరావు, అంజనాదేవి దంపతులకు సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ (అసలు పేరు కొణిదెల కళ్యాణ్ బాబు) జన్మించారు. చిన్నతనం నుంచే యోగా, మార్షల్ ఆర్ట్స్, సాహిత్యం మరియు తత్వశాస్త్రం పట్ల ఆయనకు అమితమైన ఆసక్తి ఉండేది. మార్షల్ ఆర్ట్స్‌లో ఆయన సాధించిన నైపుణ్యానికి గుర్తింపుగా "పవన్" అనే పేరును తన పేరుకు జోడించుకున్నారు.

వెండితెరపై సంచలనాలు ఒ రికార్డుల విజయం

1996లో 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన పవన్ కళ్యాణ్, అతి తక్కువ సమయంలోనే యూత్ ఐకాన్‌గా మారారు. తొలిప్రేమ (1998): జాతీయ అవార్డు సాధించి, తెలుగు సినిమాలో ఒక క్లాసిక్ లవ్ స్టోరీగా నిలిచింది.

తమ్ముడు & బద్రి: స్వయంగా ఫైట్స్ కంపోజ్ చేసుకుంటూ, సరికొత్త మేనరిజమ్స్‌తో యూత్‌లో ఒక ట్రెండ్ క్రియేట్ చేశారు. ?ఖుషి (2001): బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసి, పవన్ కళ్యాణ్‌ను ఇండస్ట్రీ ట్రెండ్‌సెట్టర్‌గా నిలబెట్టింది. ?గబ్బర్ సింగ్ ఒ అత్తారింటికి దారేది: రికార్డు స్థాయి వసూళ్లతో ఇండస్ట్రీ హిట్‌లుగా నిలిచి ఆయన స్టార్‌డమ్‌ను శిఖరాగ్రాన నిలిపాయి.

రాజకీయ ప్రవేశం ఒ జాతీయ స్థాయిలో గుర్తింపు

2014 మార్చిలో "జనసేన పార్టీ"ని స్థాపించి "సమాజంలో మార్పు కోసం, ప్రశ్నించే గొంతుకగా" ఆయన రాజకీయ రంగప్రవేశం చేశారు. పదవుల కోసం కాకుండా సిద్ధాంతాల కోసం నిలబడే నాయకుడిగా ఆయన జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. జాతీయ వేదికలపై ప్రశంసలు: ఇండో-యుకే ప్రాజెక్ట్ వారిచే లండన్‌లో 'గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు', భోపాల్‌లో నిర్వహించిన 'ఐఈఈఈ పవర్ సింపోజియం' మరియు ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 'ఇండియా కాన్ఫరెన్స్'లో ప్రసంగించే అరుదైన గౌరవం పొందారు. ?ప్రజా పోరాటాలు: మత్స్యకారుల హక్కులు, సుజల స్రవంతి ప్రాజెక్టులు, మరియు రైతుల సమస్యలపై నిరంతరం పోరాడి జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు.

సామాజిక సేవ & మానవతా దృక్పథం





పవన్ కళ్యాణ్ కేవలం రాజకీయనాయకుడిగానే కాకుండా, సహాయం కావాల్సిన ప్రతిచోటా ఒక మానవతావాదిగా ముందు నిలిచారు. ?ఉద్దానం కిడ్నీ బాధితులు: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న కిడ్నీ సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లి, పరిశోధనా కేంద్రాలు మరియు తాగునీటి ప్రాజెక్టులు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ?కౌలు రైతుల యాత్ర: ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం అందించి, ధైర్యాన్ని నింపారు. ?విపత్తుల సమయం ఒ విరాళాలు: కోవిడ్ కష్టకాలంలోనూ, వరదలు వచ్చినప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్, పిఎమ్ కేర్స్ ఫండ్స్‌తో పాటు చేనేత కార్మికులకు, కళాకారులకు కోట్లాది రూపాయల సహాయం అందించారు.

**ముగింపు**

సమాజంలో మార్పు అనేది ఒక్క రోజులో రాదని, దానికి నిరంతర శ్రమ, నిబద్ధత అవసరమని నమ్మే నాయకుడు పవన్ కళ్యాణ్. వెండితెరపై తిరుగులేని కథానాయకుడిగా వెలిగి, ప్రజాసేవలో తన జీవితాన్ని అంకితం చేస్తున్న ఆయన ప్రయాణం నవసమాజ నిర్మాణానికి ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణ.

# ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు

**మున్సిపల్ కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్**

**పారదర్శంగా ఎన్టీఆర్ సామజిక భద్రత పింఛన్ పంపిణి**

**ప్రతి నెల రూ 6 కోట్లా 21 లక్షల నగదు పేదలకు పంపిణి**



**ప్రొద్దుటూరు,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:-** ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆరవ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న డ్రైవర్ కొట్టాల ప్రాంతంలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా సామజిక భద్రత పింఛన్ పంపిణి కార్యక్రమాన్ని కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. సందర్భమగా కమీషనర్ మాట్లాడుతూ ప్రొద్దురూరు పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణి కార్యక్రమం పారదర్శంగా జరగాలని, ప్రభుత్వ నిబంధనలు మేరకు లబ్దిదారులకు ఇంటివద్దే పింఛను బట్వాడా చెయ్యాలని అలాగే లబ్ధిదారులతో సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని అన్నారు. ప్రొద్దుటూరులో దివ్యంగులకు, డప్పు కళాకారులకు, మత్సకారులకు, తలసీమియా వ్యాధిగ్రస్తులకు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వృద్దులకు, కిడ్నీ, లివర్ వ్యాధిగ్రస్తులకు ఇలా 20 రకాల సామజిక భద్రత పింఛనలు సుమారు 14094 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ 6 కోట్లా 21 లక్షలు నగదు పంపిణి చేస్తున్నామని కమీషనర్ అన్నారు. ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించడానికి అలాగే , ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రజలలోకి తీసుకెళ్లందుకు ప్రొద్దుటూరు పురపాలక సంఘం కృషి చేస్తుందని కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కార్యక్రమంలో కమీషనర్ దివ్యంగులైన మహబూబుకు, సుబ్బారాయుడుకు పింఛను నగదు అందించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# ఉత్తమ గ్రంథాలయ లైబ్రేరియన్ గా అవార్డ్ పొందిన నాదెండ్ల బాబ్జి ని ఘనంగా సన్మానం చేసిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి

**నేటి సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మనిషి చిరిగిన చొక్కా అయిన ధరించి ఒక మంచి పుస్తకాన్ని కొనుగోలు చేసి విజ్ఞానాన్ని పెంపొందిం చుకోవాలి**

**నిజ జీవితంలో కృషి నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది అన్న మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**



**జమ్మలమడుగు,సెప్టెంబర్01.అక్షరటైమ్స్:-** పట్టణంలో ఉన్న గ్రంథాలయంలో లైబ్రేరియన్ గా విధులు నిర్వహిస్తూ ఉత్తమ గ్రంథాలయ లైబ్రేరియన్ గా అవార్డు పొందిన సందర్భంగా నాదెండ్ల బాబ్జి ని ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మరియు జమ్మలమడుగు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి దుశ్శాలువతో ఘనంగా సన్మానం గావించారు. ఈ సందర్భంగా వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో పాఠకులకు ఉత్తమ సేవలు అందిస్తూ గ్రంథాలయ( విజ్ఞాన బాండాగారాల) ప్రాధాన్యతను మరింత విస్తరింపచేస్తూ అందరి మన్ననలు పొంది ఉత్తమ గ్రంథాలయ లైబ్రేరియన్ గా సేవలందించినందుకు గాను ఉన్నతాధికారులు చేతుల మీదుగా ఉత్తమ అవార్డ్ పొందినందుకు చాలా సంతోషంగా ఉంది అని కొనియాడారు.ప్రస్తుత పరిస్థితుల్లో, సామాజిక మాధ్యమాల ప్రాధాన్యత ఎక్కువ సంతరించుకున్నప్పటికి విజ్ఞాన బండాగారాల ప్రాధాన్యతను తగ్గిపోకుండా అందుకు అనుగుణంగా పాఠకులు వచ్చి సద్వినియోగం చేసుకునేలా తీర్చిదిద్దిన వ్యక్తి అని కొనియాడారు. ఏది ఏమైనా ప్రస్తుత రోజుల్లో ప్రతి మనిషి చినిగిన చొక్కా అయిన ధరించు కానీ ఒక మంచి పుస్తకాన్ని కొనుగోలు చేసి చదువుకుంటే విజ్ఞాన వంతులు అవుతారని తెలిపారు.గ్రంథాలయ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలి అన్నారు.నేటి సమాజంలో ప్రతి ఒక్కరు తాను విధి నిర్వహణలో ఏ స్థాయిలో ఉన్న అంకితభావంతో పనిచేస్తూ పోతే ఉత్తమ అవార్డు పొందడం సులభం అన్నారు.కృషి నీ ఆయుధం అయితే విజయం మన బానిస అవుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో గండికోట చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ వై.చంద్ర శేఖర్ రెడ్డి,రోటరీ క్లబ్ జోనల్ సెక్రటర్ కుండా భాస్కర్,డాక్టర్ యమ్.యల్.నారాయణరెడ్డి, శ్రీనివాసులు, తపాలా శాఖ అధికారి టి.వెంకటేశ్వర రెడ్డి,గ్రంథాలయ కమిటీ పెద్దలు అమీర్, చెన్నారెడ్డి, మధు,మనోహర్ రెడ్డి,కె పార్థ సారథి, సంజీవ రాయుడు, టి.లక్ష్మీ రెడ్డి,పద్మ నాభం మరియు తదితరులు పాల్గొన్నారు.